

నారావారిపల్లెలో చిరుత కలకలం



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, నారావారిపల్లె గ్రామ పరిధిలో చిరుత హల్చల్ చేసింది. నారావారిపల్లెలోని కళ్యాణ మండపానికి సమీపంలోని కొండపై చిరుత సంచరిస్తూ స్థానికులకు కనిపించింది. దూరం నుంచి గుర్తించిన కొందరు చిరుత సంచరిస్తున్న దృశ్యాలను మొబైల్లో వీడియోలు తీశారు. ఇప్పుడు ఆ వీడియోలు వైరల్గా మారాయి. ఉదయం 10 నుంచి 12 గంటల నడుమ చిరుత సంచరించినట్లు తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు, గ్రామస్తులు అప్రమత్తమై బాణా సంచా కాలుస్తూ డప్పులు వాయిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఉపాధి హామీకి.. ఉప్పు పాతర..!



తిరుపతి గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం, అలాగే ఈ పథక అమలులో కేంద్ర ప్రభుత్వం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను వదిలేసి వ్యయ భారాన్ని రాష్ట్రాలపై 40 శాతం మోపడం వంటి ప్రజావ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) పార్టీ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి నగరంలోని గాంధీ విగ్రహం వద్ద కళ్లకు నల్ల రిబ్బన్ ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, నగర కార్యదర్శి కే.వేణుగోపాల్‌లు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఒక సామాజిక భద్రతా పథకమని, అలాంటి పథకాన్ని దశలవారీగా నిర్వీర్యం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదల జీవన హక్కులపై నేరుగా దాడి చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం రాజకీయ కక్ష సాధింపేని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు ఉండటం యాదృచ్ఛికం కాదని, అది పేదల కోసం జరిగిన పోరాటాలకు ప్రతీకగా నిలిచిందని సీపీఐ(ఎం) నేతలు పేర్కొన్నారు. అలాంటి పేరును తొలగించడం అంటే గాంధీజీ ఆశయాలను తిరస్కరించడమే కాకుండా, పేదల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోందని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపుతో తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయమని విమర్శించారు.

నిధుల కుదింపుతో.. పథకం కాగితాలకే పరిమితం

కేంద్ర ప్రభుత్వం పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాగితాలకే పరిమితం అవుతోందని సీపీఐ(ఎం) నేతలు తెలిపారు. పనిదినాలు తగ్గిపోవడం, వేతనాల చెల్లింపుల్లో తీవ్రమైన జాప్యం, పెండింగ్ బిల్లులు పెరిగిపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సంక్షోభం తీవ్రమవుతోందని అన్నారు.

రాష్ట్రాలపై 40 శాతం భారం.. సంఘ సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం

పథక వ్యయంలో 40 శాతం రాష్ట్రాలు భరించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సంఘ సమాఖ్య వ్యవస్థపై దాడిగా సీపీఐ(ఎం) అభివర్ణించింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలపై అదనపు భారం మోపడం ద్వారా ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ అసలు ఉద్దేశమని నేతలు ఆరోపించారు. పేదల ఉపాధి హక్కును హరించే ప్రయత్నాన్ని సీపీఐ(ఎం) అంగీకరించదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పి.సాయి లక్ష్మి, ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, ఎం.మాధవ్ ఎం.నరేంద్ర, పి.చిన్న, పి.రమేష్ బాబు, డి.పార్థసారథి, శివ, వాసు, సిద్దు, రవి, సూరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహాత్మా గాంధీ



గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేయడం దారుణమని నిరసిస్తూ, సిపిఎం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం దగ్గర కళ్లకు గంతులు కట్టుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పుత్తూరు ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీని ఒకవైపు పొగుడుతూ మరోవైపు ఆయన పేరుతో ఉన్న పథకాన్ని పూర్తిగా రద్దుచేసి, మరో కొత్త పథకాన్ని తీసుకురావడం దారుణమన్నారు. కొత్తగా వచ్చిన పథకంలో పేరుకు 125 రోజులు పెంచినప్పటికీ రైతులకు వ్యవసాయ పనుల సీజన్లో 60 రోజుల పని నిబంధన పెట్టారని తెలిపారు. వ్యవసాయ కూలీల కడుపు కొట్టే చర్యలు బిజెపి ప్రభుత్వం చేపడుతోందని దుయ్యబట్టారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వ్యవసాయ కూలీలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు నందయ్య, కాంతారావు, రాఘవమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టానికి మోడీ తూట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశంలోని నిరుపేదలకు



చేతినిండా పని.. మూడు పూట్లా తిండి పెట్టేందుకు అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో పురుడు పోసుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మోడీ తూట్లు పొడుస్తున్నాడని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి విమర్శించారు. మహాత్మా గాంధీ ఉపాధి చట్టం పేరును జీ రామ్ జీ గా మార్చడంపై తేరు వీధిలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిపిఎం నాయకులు శుక్రవారం నిరసన తెలియజేశారు. ఉపాధి చట్టంలో మార్పులు చేసి నిధుల భారాన్ని రాష్ట్రాలకు వదిలి, కేంద్రం పారిపోయే కుట్ర చేస్తోందంటూ మణి మండిపడ్డారు. ఫలితంగా ఉపాధి పథకానికి నిధుల లేమి ఏర్పడి పూర్తిగా రామ్ రామ్ పాడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 2005లో అప్పటి కమ్యూనిస్టుల భాగస్వామ్యంలోని యూపీఏ ప్రభుత్వం పేదలకు మేలు చేకూర్చేలా చేసిన చట్టాన్ని మోడీ ప్రభుత్వం కుట్ర పూరితంగానే నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై వెనక్కి తగ్గకుంటే తగిన పర్యావసనాలు తప్పవని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, రాపూరు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): భారతదేశంలో మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్ పేర్లను లేకుండా చేయాలనే దుర్మార్గపు ఆలోచనతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా దినసరి కూలీలకు పని దినాల కల్పనకు చట్టబద్ధత తీసుకురావాలని 2005 అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చారని, నేడు దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఉపాధి కూలీలకు ఆసరాగా ఉన్న ఈ పథకం పేరు మార్పుతో దూరం చేయడానికి కేంద్ర సర్కారు దుస్సాహసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ తిరుపతి పట్టణ అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు ఆరోపించారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని గాంధీ విగ్రహం ఎదుట కళ్ళకు గంతలు కట్టుకుని కాంగ్రెస్ పార్టీ నేతలు ఉపాధి హామీ చట్టం పేరు మార్పు చేయడం సహించరాని తప్పని నినదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ అధికార బలంతో ప్రధాని మోడీకి కాంగ్రెస్ మీద కోపమా లేక మహాత్మా గాంధీ మీద కోపమా తెలియడం లేదని హఠాత్తుగా ఈ చట్టానికి గాంధీ పేరుని తొలగించి రాముడు పేరు వచ్చేలా పేరు మార్చడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇది దేశద్రోహమని మండిపడ్డారు. భవిష్యత్తులో భారత కరన్సీపై ఉన్న మహాత్మాగాంధీ చిత్రాన్ని తొలగించి తన చిత్రాన్ని లేదా గాడ్సే చిత్రాన్ని పెట్టేలా మోదీ వ్యవహరిస్తున్నారన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ పార్లర్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్‌గా పేరు మార్చేందుకు పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టడం, అధికార బలంతో దాని ఆమోదింప చేసుకుని క్షమించరాని తప్పు చేశారన్నారు. దీనివలన ప్రభుత్వం భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, జాబ్ కార్డులపై ఉన్న ఫోటోలను మార్పు చేయడానికి కోట్లాది రూపాయలు వ్యయం అవుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, నాగరాజు యాదవ్, మహేష్, కృష్ణమూర్తి, శివకుమార్, వినోద్ కుమార్, నరేంద్రబాబు, జ్యోతీశ్వర్ నాయక్, చిరంజీవి, శోభరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులపై లాఠీచార్జీ హేయం



వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికుల దర్నా

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మూడు రోజులుగా నెల్లూరులో పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారన్నారని తెలిపారు. న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేయాల్సింది పోయి అప్రజాస్వామికంగా పోలీసులు వారిపై లాఠీ చార్జ్ జరిపారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలతో ఆసభ్యకరంగా ప్రవర్తించి, తాకరానిచోట తాకిన మగ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు న్యాయమైన డిమాండ్స్ కోసం 40 రోజుల నుండి ఆందోళన చేస్తుంటే, అధికారులు స్పందించనందున, పోరు బాట పట్టాల్సి వచ్చిందన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కారించాలని, అక్రమ అరెస్టులు ఆపాలని, లాఠీ చార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నెల్లూరు పారిశుద్ధ్య కార్మికులపై జరిగిన లాఠీచార్జికి నిరసనగా కార్మికులకు అండగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కార్మికులు నిరసన తెలియజేస్తున్నారన్నారు. న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కోసం భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు పెంచలయ్య ఉపాధ్యక్షులు పెంచలయ్య సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రెటరీ రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాజయ్య, సిఐటియు నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన తిరుపతి శ్రామిక ఉత్సవ్





కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యక్షులు నడ్డి నారాయణ, కార్యక్రమంలో భాగంగా నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) అఖిల భారత మహాసభ సందర్భంగా తిరుపతిలో "తిరుపతి శ్రామిక ఉత్సవ్" పేరుతో మూడు రోజులు పాటు సాగే సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం వినాయక సాగర్ వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ కార్యక్రమానికి శ్రామిక ఉత్సవ్ కమిటీ గౌరవ అధ్యక్షులు కేవీ చౌదరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ శ్రామిక వర్గాల పోరాట సంప్రదాయాలు, వారి శ్రమ విలువ, కార్మిక హక్కుల కోసం సాగిన చారిత్రక ఉద్యమాలు, నేటి కార్మికులపై జరుగుతున్న దాడులను ప్రజల ముందుకు తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమంలో విప్లవ గీతాలు, ప్రజానాట్యాలు, నాటికలు, స్కిట్లు, కవితా పఠనం వంటి అనేక కళారూపాలు ప్రదర్శించబడ్డాయి. కార్మికుల దైనందిన జీవితం, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రతల లేమి, కాంట్రాక్ట్ విధానం, ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల సవరణల వల్ల ఎదురవుతున్న సమస్యలను కళాకారులు ప్రభావవంతంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఒకింత ఆలోచింపజేశాయని తెలిపారు. ముఖ్యంగా యువ కార్మికులు, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రతిబింబించిన ప్రదర్శనలకు విశేష స్పందన లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలు దేశవ్యాప్తంగా శ్రామిక వర్గాలపై తీవ్రప్రభావం చూపుతున్నాయని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా యజమానుల పక్షాన చట్టాలు రూపొందించబడ్డాయని, దీని వల్ల శ్రామికుల హక్కులు, ఉద్యోగ భద్రతలు, సామాజిక రక్షణకు తీవ్ర ముప్పు ఏర్పడిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో శ్రామిక వర్గం అంతా ఐక్యంగా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ దేశవ్యాప్తంగా శ్రామిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి దిశానిర్దేశం చేస్తుందని, కార్మికుల సమస్యలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించబడుతుందన్నారు. శ్రామిక వర్గాల ఐక్యత, సంఘటిత పోరాటాల ద్వారానే కార్మిక హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, నిర్వాహకులు మల్లారపు నాగర్జున, నడ్డి నారాయణ, కడివేటి మునిరత్నం, రెడ్డి ప్రసాద్, ఆమూరు సుబ్రహ్మణ్యం,మాధవ్, బుజ్జి, కె.వేణుగోపాల్, ఆర్ లక్ష్మి, మునిలక్ష్మి, రెడ్డిప్రసాద్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి




మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: విశాఖపట్నంలో 31 నుండి నిర్వహించనున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్‌లు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఉపాధిహామీ పథకంలో మార్పులను వ్యతిరేకిస్తూ కర్యాచరణ రూపొందించనున్నారని తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మునిరాజా, జిల్లా నాయకులు సెల్వరాజ్, బిఎన్ కండ్రిక మండల కార్యదర్శి రమణయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ఆ వాహనాలను ఎందుకు పక్కన పెట్టారో...?

- రౌండ్ అప్ వాహనాలు ఎవరికోసమో....?
- వేలంపాట కొచ్చిన వారు తీవ్ర అసహనం
- నేడే అటవీశాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం





ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి అటవీశాఖ సర్కిల్ పరిధిలో శేషాచలం అడవుల నుండి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలించుకుపోతూ అధికారుల తనిఖీలలో పట్టుబడ్డ వాహనాలకు సంబంధించి శనివారం కపిలతీర్థం వద్ద ఉన్న అటవీ శాఖ కార్యాలయం ప్రాంగణంలో వేలంపాటలు నిర్వహించడానికి ఈనెల రెండవ తేదీన అటవీశాఖ తిరుపతి డివిజన్ అధికారులు టెండర్ వేలం నోటీసును పత్రికల ద్వారా ఔత్సాహికులకు తెలిపారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలతో కలిపి 375 వాహనాలకు టెండర్ వేలం నిర్వహిస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. అయితే అటవీ శాఖ అధికారులు నిర్వహించే ఈ వాహనాల వేలం ద్వారా కండిషన్లో ఉన్న వాహనాలను వేలంపాట ద్వారా దక్కించుకోవడానికి చిత్తూరు, తిరుపతి ప్రాంతంతో పాటుగా కోడూరు, కడప, ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల నుండి దాదాపు 30 మందికి పైగా సీల్డ్ టెండర్లు సమర్పించడానికి 19వ తేదీ అటవీ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. 19వ తేదీ మధ్యాహ్నం వరకే సీల్డ్ టెండర్లు ఇవ్వడానికి సమయం ఉండడంతో పెద్ద సంఖ్యలో వేలంలో పాల్గొనడానికి ఔత్సాహికులు ఉత్సాహం చూపారు. తాము ఎంపిక చేసుకొని వేలంపాట ద్వారా ఆ వాహనాలను దక్కించుకోవడానికి వచ్చిన ఔత్సాహికులకు అటవీశాఖ అధికారులు కొన్ని వాహనాలకు సంబంధించి లిస్టులో " రౌండ్ అప్ " చేసి ఉండడంతో ఒక్కసారిగా ఖంగు తిన్నారు. ఇదేమిటో అర్థం కాక అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా ఎవరు సరైన సమాధానం చెప్పకపోవడంతో నిరాశకు గురయ్యారు. తీరా తాము వేలంపాట ద్వారా దక్కించుకోవాలని చూసిన వాహనాలు వేలంపాటలో ఉంచడం లేదని తెలియడంతో కొంతమంది వెనుతిరిగి వెళ్లిపోయారు.

సాధారణంగా.. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వాహనాలు కోర్టుల ద్వారా క్లియరెన్స్ పొంది అటవీశాఖ వేలం నిర్వహించిన తరువాత ఔత్సాహికులు వేలంపాటలో హెచ్చు పాటను పాడి దక్కించుకునేవారు. అటవీ శాఖ ఇచ్చిన నోటీసు ప్రకారం 375 వాహనాలకు వేలం నిర్వహించాల్సి ఉండగా అందులో దాదాపు 65 నుండి 70 వాహనాలు వేలం పాటలో ఉంచడం లేదని, గోడపై అతికించిన వాహనాల లిస్టులో కొన్ని వాహనాలకు సంబంధించి స్కెచ్ తో రౌండప్ చేసి ఉంచారు. మోడల్ ను బట్టి అంతో ఇంతో కండిషన్ ఉండే వాహనాలను దక్కించుకోవడానికి వచ్చిన ఔత్సాహిక వేలంపాట దారులు నిరాశతో వెనుతిరగాల్సి వచ్చింది. కొన్ని వాహనాలను అటవీ శాఖ విధుల నిర్వహణ కోసం పిసిసిఎఫ్ ఆదేశాలతో పక్కన ఉంచినట్లుగా సమాచారం. ఆ విషయం నేడు వేలమనగా ఈరోజు లిస్టులో రౌండ్ చేయడం ఏంటని కొంతమంది అటవీశాఖ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మీరు కోరిన వాహనాలు పక్కన పెట్టి మిగిలిన వాహనాలకు టెండర్ వేలం నోటీసును ఇచ్చి ఉంటే బాగుంటుందని అధికారులకు సలహాలు ఇచ్చిన పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా పారదర్శకంగా జరగాల్సిన వేలం ఇలా మధ్యంతర మార్పులతో గందరగోళంగా మారింది.

నేటి నుంచి గిరిజన జాతీయ సాంస్కృతికోత్సవాలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బంజారా జన్ సంఘ్ ఆధ్వర్యంలో సంఘం 8వ వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 20, 21, 22 మూడు రోజుల పాటు తిరుపతి నగర పరిధిలోని గిరిజన భవన్ వేదికగా గిరిజన జాతీయ సాంస్కృతికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బంజారా జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరుగున పడిపోతున్న గిరిజన సంస్కృతి, సాంప్రదాయ కళారూపాలను నేటి యువతరానికి తెలుపాలని ఉద్దేశంతో ఈ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ఉత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ విలేకరుల సమావేశంలో బంజారా జన్ సంఘ్ ప్రతినిధులు వెంకటేష్ నాయక్, వినోద్ రాథోడ్, బాలాజీ నాయక్, రమేష్ నాయక్, సౌందర్య నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగం తగ్గింపులో
తిరుపతి నగరపాలక సంస్థకు బంగారు పతకం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగం తగ్గించడంతో రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డులు 2025లో తిరుపతికి బంగారు పథకాన్ని ప్రకటించారని కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో విద్యుత్ వినియోగం తగ్గించేందుకు అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థకు తెలుగు గంగ నీటిని నాలుగు ప్రధాన మార్గాల ద్వారా తరలిస్తున్నామన్నారు. ఈ నీటిని కే.పి.కెనాల్ నుండి తిరుపతి వరకు తీసుకువచ్చేందుకు విద్యుత్ వినియోగం ఎక్కువ అవసరమని, ఈ వినియోగాన్ని తగ్గించేందుకు రామాపురం పంప్ హౌస్‌లో తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో 4 మెగా వాట్స్ ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్ వినియోగంతో పంప్ హౌస్‌ల బిల్లులు గణనీయంగా తగ్గాయన్నారు. తూకివాకం వద్ద మరో ఆరు మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీంతీ విద్యుత్ బిల్లులు తగ్గే అవకాశం ఉందన్నారు. నగరంలో కూడా పలు చోట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో బిల్లులు తగ్గాయని తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల అధికారులు, సిబ్బందికి కమిషనర్ అభినందనలు తెలిపి, భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించేలా పనిచేయాలని తెలిపారు. కాగా శనివారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో బంగారు పతకాన్ని అందుకోనున్నారు.

ఫిర్యాదు చేసిన 30 రోజుల్లోనే న్యాయం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ వినియోగదారుల వారోత్సవాలు సందర్భంగా జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం' ప్రచురించిన డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం అనే అంశంపై ప్రచురించిన గోడ పత్రికను జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ మౌర్య ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వినియోగదారుల కేసుల పరిష్కారాన్ని, సులభతరం, వేగవంతం చేయడానికి, సమర్థంగా నిర్వహించడాని కి 'ఈ- జాగృతి' డిజిటల్ ప్లాట్ ఫామ్ సౌకర్యవంతమని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేసుకొని, తద్వారా తక్కువ ఖర్చుతో న్యాయ అవకాశాలు పొందవచ్చున్నారు. ఈ వ్యవస్థను పటిష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ వ్యవస్థను సద్వినియోగం చేసుకొని న్యాయం పొంది, ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారులసంఘం అధ్యక్షులు, పి.రాజారెడ్డి, కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, దేవేంద్ర, శ్రీనివాసులు నాయుడు, చెంచు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల పెంపుకై మరో చారిత్రక పోరాటానికి సన్నద్ధం కావాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పిలుపు
- గూడూరు ప్రాజెక్టులో 242 మంది అంగన్వాడీలు సీఐటీయూలో చేరిక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

అంగన్వాడీలు వేతనాల పెంపు కై మరో చారిత్రాత్మక పోరాటానికి సంసిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా, గూడూరు సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గూడూరు డివిజన్ అంగన్వాడీల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్ 12న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడీలు చేపట్టిన పోరాటానికి టి.డి.పి, జనసేన పార్టీలు పోటీపడి మద్దతిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీతాలు పెంపుపై మీన, మేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తరహాలో వేతనాలు, సెలవులు, సౌకర్యాలు పెంచడానికి చంద్రబాబుకున్న ఆటంకాలు ఏమిటో సెలవివ్వాలని ప్రశ్నించారు. వేతనాలు పెంచకుంటే 2026 నూతన సంవత్సరంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

242 మంది అంగన్వాడీలు సిఐటియులో చేరిక

గూడూరు అర్బన్ పరిధిలోని మూడు సెక్టార్లకు చెందిన అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి సమక్షంలో కె.హెప్సిబ, నాగమణిమ్మల ఆధ్వర్యంలో 242 మంది సిఐటియులో చేరారు. సిఐటియు లో చేరిన వర్కర్లకు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గూడూరు రూరల్, అర్బన్ ప్రాంతాల అంగన్వాడీలు తాము ఐక్యంగా కలిసి ఉంటామని, సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) తిరుపతి జిల్లా అధ్యక్షురాలు పద్మలీల, జిల్లా నేతలు ఎన్.స్వరూపరాణి, శ్యామల, గూడూరు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు బి.ఎస్.ప్రభావతి, ఎ.ఇంద్రావతి, గూడూరు పట్టణ సిఐటియు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు ఎస్.కే. జిలాని, ఎస్. ముత్యాలయ్య, ఎంబేటి చంద్రయ్య, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సిఐటియులో చేరిన అంగన్‌వాడీలతో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

నేటి నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా 20, 21వ తేదీల్లో తిరుపతిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి, పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు స్టాల్స్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. స్టాల్స్ పోటీల్లో విజేతలతోపాటు సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఈనెల 21వ తేదీన రాష్ట్ర ఇంధన శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - నాగలాపురం: ప్రజా దర్బార్ ద్వారా ప్రతి సమస్యను పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నాగలాపురంలో ఎమ్మెల్యే నేతృత్వంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకు అందించారు. మొత్తం 147 అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కొన్ని సమస్యలకు సంబంధిత అధికారుల ద్వారా తక్షణ పరిష్కార మార్గం చూపగా, పెద్ద సమస్యలను జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బాలాజీ నాయక్, తహశీల్దారు హనుమాన్ నాయక్, ఎంఈఓ బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యల అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని పరిష్కారం కాకపోతే ఎందుకు కాలేదో, అర్జీదారునికి తెలియజేయాలని రెవిన్యూ శాఖలో అవినీతి ఎక్కువగా జరుగుతుందని ఫిర్యాదులు స్తున్నాయని సిబ్బంది పద్ధతి మార్చుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హెచ్చరించారు .గూడూరు పట్టణంలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ గ్రీవెన్స్ డేను ఎమ్మెల్యే సునీల్ కుమార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్ రావు, నాయకులు కిరణ్ కుమార్, వెంకటేశ్వరరాజు, రహీం, పెంచలయ్య, బిల్లు చెంచురామయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

అరబిక్ రెస్టారెంట్ ప్రారంభం



రెస్టారెంట్ యాజమాన్యానికి పులివర్తి సుధారెడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి, రవాణా శాఖ కూడలి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అరబిక్ రెస్టారెంట్‌ను తెలుగు మహిళా నేత పులివర్తి సుధారెడ్డి, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ రెస్టారెంట్ దినదినాభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షిస్తూ నిర్వాహకులు అన్నమయ్య జిల్లా కమ్మ సంఘం అధ్యక్షులు శివనారాయణ, దేవర్షిణిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ టిడిపి అధ్యక్షులు కొల్లూరి ఈశ్వరయ్య, గోవిందరాజులు, అల్లా భాష, హరికృష్ణ, సురేష్ నాయుడు, చిన్నరెడ్డిబాబు, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను మంచి పౌరులుగా తీర్చి దిద్దండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బాల, బాలికలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సాకం నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం సుభాష్‌నగర్, వర్ధమాన్ విద్యావిహార్ పాఠశాలలో నిర్వహించిన సారస్వత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందన్నారు. తిరుపతి జిల్లా పౌర చైతన్య వేదిక అధ్యక్షులు వాకా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సామాజిక చింతన అలవరచు కోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రమణ్యం సభకు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిద్ధేంద్ర శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి వర్కర్లకు 5జీ ఫోన్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ ప్రాజెక్ట్ రాస్ ఆధ్వర్యంలోని అంగన్వాడీ సూపర్ వైజర్స్, వర్కర్స్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన 5జీ ఫోన్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం పంపిణి చేశారు. సీడీపీఓ సుధారాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్ వైజర్స్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఫోన్ల పంపిణిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందించేందుకు 5జీ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.


ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ ప్రాజెక్ట్ రాస్ ఆధ్వర్యంలోని అంగన్వాడీ సూపర్ వైజర్స్, వర్కర్స్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన 5జీ ఫోన్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం పంపిణి చేశారు. సీడీపీఓ సుధారాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ సూపర్ వైజర్స్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఫోన్ల పంపిణిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పారదర్శకంగా అందించేందుకు 5జీ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ


ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలను తిరుపతి పార్లమెంట్ జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాన్‌తో రైతులు తీవ్రంగా నష్ట పోయారని, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు 80 శాతం సబ్సిడీ ద్వారా విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, మండల కార్యదర్శి అల్లం కృష్ణయ్య, రైతులు, ఆర్ఎస్‌కె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదగాలి



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి ప్రభుత్వం మహిళలను వ్యాపారవేత్తలుగా చేసి, వారి కుటుంబానికి అండగా నిలిచే విధంగా చేయూత నిస్తుందని, రాష్ట్ర మొదలిర్ సంఘం కార్పొరేషన్ టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డి.గణేష్‌లు తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ గేటు పుత్తూరు 7వ వార్డులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) నాగాలమ్మ మహిళా సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో గ్రూప్‌లకు రుణాలు ఇచ్చి, వారి కుటుంబాలకు అవసరమైన వ్యాపారం చేసుకునేందుకు ప్రోత్సహిస్తోందని, సొంతింటి కల నెరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డ్ కౌన్సిలర్ ఎన్.డి.మణియమ్మన్, డీకే దేవరాజు, డిఎస్ ఆర్ముగం, గోపాల్, అన్బు, మెప్మా లీడర్లు సుజాత, పద్మ, లావణ్య , డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మళ్లీ 'ప్రజల వద్దకు పాలన'



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: మళ్లీ ప్రజల వద్దకు పాలన కార్యక్రమం ద్వారా పరిపాలన నేరుగా గ్రామాలకే చేరనుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెల్లడించారు. శుక్రవారం వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలనలో భాగంగా జిల్లా కలెక్టర్లు సైతం గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించనున్నారని తెలిపారు. తాను కూడా త్వరలోనే పంచాయితీల వారీగా పర్యటించి, స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

సీఎం సహాయ నిధి పేదలకు వరమని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన 37 మంది కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారని, వారి వైద్య ఖర్చుల కింద మొత్తం రూ.18 లక్షల 52 వేల సహాయాన్ని సీఎం సహాయనిధి ద్వారా అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూటిఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నికలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: యుటిఎఫ్ తిరుపతి రూరల్ మండలం, కౌన్సిల్ సమావేశం స్థానిక పెద్దకాపు లేఔట్‌లో యుటిఎఫ్ భవనంలో శుక్రవారం జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఆవని గడ్డ పద్మజ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి సి.సురేష్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా అవిలాల శేఖర్, అధ్యక్షులుగా చెర్లోపల్లి రంజిత్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా వేదాంతపురం సౌజన్య, కోశాధికారిగా యోగిమల్లవరం శేఖర్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా మోహన్ రెడ్డి, గంగయ్య, లాలిత్య, మోహన్, షాజహాన్, సాంబశివరెడ్డిలను, మండల కార్యదర్శిలుగా జై చంద్ర రాజు, స్వరూప, రాణి, నారాయణమ్మ, గాయత్రి, మురళి, నాగలక్ష్మి, శేషాద్రి, సుమతి, లోకనాథం సిపిఎస్ కమిటీ కన్వీనర్ గా శైలశ్రీ, కల్చరల్ కమిటీ కన్వీనర్‌గా రెడ్డి ప్రసాద్‌లను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఆర్ నాగరాజు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హేమాద్రి బాబు, షేక్ ఖాదర్ బాషా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: యుటిఎఫ్ తిరుపతి నగరపాలక మండల శాఖ ఎన్నికలు తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. మండల శాఖను అందరూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్యంగా ఉపాధ్యాయ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని నూతన కమిటీ ప్రకటించింది. మండల గౌరవాధ్యక్షులుగా రెడ్డప్ప రెడ్డి, ఉమెన్ కన్వీనర్‌గా కే.వరలక్ష్మి, నగర అధ్యక్షులుగా వై.హేమాద్రి బాబు, నగర ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాదర్ బాషా, ఆర్థిక కార్యదర్శిగా వి.ప్రభు కుమార్ శెట్టి, నగర కన్వీనర్‌గా ఎస్.జె శ్రీనివాసన్, సహాధ్యక్షులుగా ఏ.కృష్ణ కుమార్, ఎం.మారుతీ దేవి, ఆర్.గుణశేఖర్, సహా కార్యదర్శులుగా వి.ప్రభాకర్ రావు, పి.మన్సూర్ అలీ ఖాన్, జి.శ్రీరాములు, మహిళా కార్యదర్శులుగా పి.కవిత, పి.మాలతి, ఎం.ప్రసన్న కుమారి, డాక్టర్ ఎం.నిర్మలా బాయ్, కె.సుధా, బండి శకుంతల, ఓపిఎస్ సాధన కన్వీనర్లుగా ఢిల్లీ ప్రసాద్, శేఖర్ బాబు, ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్‌గా పి.గోపాల్, ఎఫ్‌డబ్ల్యూఎస్ కన్వీనర్‌గా వి.సునీత, జిల్లా కౌన్సిలర్లుగా బి.మధుసూదన్ రెడ్డి, ఎన్ మోహన్ రెడ్డి ,ఏ తులసి ప్రకాష్ ,పి మురుగయ్య ,బి సుధాకర్ రెడ్డి, పెద్ద రెడ్డప్ప,మండల కార్యదర్శులుగా ఎస్ మంజుల, %వీ% నవీన్, చైతన్య, మౌళీ కృష్ణ, శ్రీ వేణి, ముధసిర్ అహ్మద్, ముజీబుర్ రెహమాన్, ఏ.కుమార్, ఎన్.రమ్య, రెడ్డిస్వరి, రెడ్డి రాణి, వాసంతి ,ప్రియాంక, శశికళ, శ్రీనాథ్ విశ్వనాథ్, వాసంతి, మండల సలహా కమిటీ సభ్యులుగా పి.శ్రీలక్ష్మి, సిఆర్ ప్రవీణ కుమారి, పి హేమలత, వి.సునీత, పిఎస్ హేమలత, ఎన్.నిర్మలాకుమారి, వై.జ్యోతి, యన్.బత్తేమ్మ, వి.నాగరత్నమ్మ, ఎన్.సుభాషిని, ఎస్ తస్మియా మోయిన్, బి సుధాకర్ రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి టి.సురేష్ ఎలక్షన్ ఆఫీసర్‌గా, బి మధుసూదన్ రెడ్డి అబ్జర్వర్‌గా ఉండి ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ నాయుడు, డి.నిర్మల, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, గౌరవ అధ్యక్షులు గండు రామచంద్రయ్య, జిల్లా నాయకులు మురళీకృష్ణంరాజు, అవనిగడ్డ పద్మజ, మధు పాల్గొన్నారు.



ప్రజాశక్తి -వరదయ్యపాలెం: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటిఎఫ్)వరదయ్య పాలెం, మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జిల్లా నాయకులు హేమాంబరధరం రావు, వెంకట కృష్ణయ్య, శివకుమార్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా గుర్రప్ప, అధ్యక్షుడుగా శశి కుమార్, ప్రధాన కార్యదర్శిగా సురేష్ భగవాన్, ఆర్థిక కార్యదర్శిగా కొండలరావులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సూర్య సరస్వతి, జిల్లా కౌన్సిలర్లుగా రుషేంద్ర బాబు, వెంకటయ్య, మండల కార్యదర్శులుగా తాతబాబు, శంకర్రావు, హేమంతు, శ్రీనివాసరావు, వెంకట్ నాయుడు, వెంకట మోహన్ రామారావు, రాధా రాణి, తిరుపతి నాయుడు, రాజు, శ్రీధర్ రావు తదితరులు ఎంపికయ్యారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మోడల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ ఏర్పేడు మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కోశాధికారి కె.మోహన్ బాబు హాజరయ్యారు. అధ్యక్షులుగా సి.గురవారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.రామకృష్ణయ్య, గౌరవ అధ్యక్షులుగా జి.సీతాపతి, సహాధ్యక్షులుగా ఎన్.మునిరత్నం, ఎం.ఎం శాంతి, ఆర్థిక కార్యదర్శిగా సి.వెంకటరమణయ్య, జిల్లా కౌన్సిలర్లుగా టి.చెంచు రెడ్డి, సి.చిట్టి బాబు, జి.సుధాకర్, జి.చలపతి, జి.విజయ శేఖర్, జి.రమేష్, బి.రాజ గంగాధర్, పి.నాగరాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, యూటీఎఫ్ లక్ష్యాల సాధన కోసం నూతన కమిటీ పని చేస్తుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ కన్వీనర్ ఎ.నాగరాజు, కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్ భక్తవత్సలం, సీనియర్ నాయకులు రాజయ్య నాయుడు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు ఎ.గుణశేఖర్, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొని మాజీ గౌరవ అధ్యక్షులు ఎం.భక్తవత్సలంను సన్మానించారు.

విశ్వనాథరెడ్డిని విధుల్లోకి రానివ్వం : విద్యార్థి సంఘాలు



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో గత నెలలో సైకాలజీ డిపార్ట్‌మెంట్‌లో విశ్వనాథరెడ్డి అనే ఆచార్యుడు నేరుగా సీనియర్ విద్యార్థుల చేత జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయించిన విషయం, అప్పట్లో విద్యార్థి సంఘాల తీవ్రమైన పోరాటం వల్ల ప్రభుత్వం స్పందించి ఆయన్ని సస్పెండ్ చేసింది. అయితే ఒక నెల రోజులు కూడా గడవకుండానే మళ్ళీ ఆయన్ని యూనివర్సిటీ అధికారులు విధుల్లోకి తీసుకోవడంతో విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తూ శుక్రవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు నేరుగా వీసీని కలిసి "సస్పెన్షన్ ఎందుకు ఎత్తివేశారు?" అని ప్రశ్నించారు. వీసీ ప్రొఫెసర్ టాటా నర్సింగారావు బదులిస్తూ.. సైకాలజీ డిపార్ట్‌మెంట్‌లో కేవలం ఒకే ఒక రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారని, అంతేకాక పీజీ విద్యార్థులు ఆయన్ని విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రాలు ఇచ్చారని, పరిశోధన చేస్తున్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, అందుకోసమే ఆయన్ని విధుల్లోకి తీసుకుంటున్నామని పొంతన లేని సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘాల నాయకులు పరిపాలన భవనం ఎదుట నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, వైయస్సార్ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షుడు మన్యం ప్రేమ్ కుమార్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, నెల్సా వ్యవస్థాపక అధ్యక్షుడు సుందర్ రాజు, ఓబిసి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు విజయ్ ఉత్తరాది, నిఘా నేత్ర వ్యవస్థాపక అధ్యక్షులు హరికృష్ణ నాయక్, జిఎన్ఎస్ వ్యవస్థాపకుడు శివశంకర్ నాయక్, ఏపీ విహెచ్ఎస్ అధ్యక్షులు ముని మాట్లాడుతూ.. వర్సిటీ అధికారులు తప్పు చేసిన ప్రొఫెసర్లను సమర్థిస్తూ, సమస్యల మీద పోరాడే విద్యార్థి సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. నలుగురు మహిళా విద్యార్థుల చదువు నాశనం చేసిన ఇలాంటి కీచక ఆచార్యుడిని మళ్లీ విధుల్లోకి తీసుకోవడం వల్ల విశ్వవిద్యాలయానికే పరువు పోయిందని తెలిపారు. ఇదే అదునుగా తీసుకొని మరికొంత మంది ప్రొఫెసర్లు అరాచకాలకు తెరలేపుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి సస్పెన్షన్‌ను ఆరు నెలల పాటు కొనసాగించకపోతే, వర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చి, నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వినోద్, పవిత్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, ఉదయ్, నాయకులు తేజ, గ్రీస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీపీడీసీ సభ్యుల సమావేశం



ప్రజాశక్తి - నాయుడుపేట: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో శుక్రవారం సీపీడీసీ (కాలేజీ ప్లానింగ్ డెవలప్మెంట్ కమిటీ) సర్వసభ్య సమావేశం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కాలేజీ ప్రహరీ గోడ నిర్మాణంపై చర్చించారు. ప్రహరీ గోడ నిర్మాణం నిమిత్తం తిరుపతి ఎంపీ నిధుల నుంచి పది లక్షల రూపాయలు వెచ్చించినట్లు తెలియజేశారు. వీలైనంత త్వరలో ప్రహరీ గోడకు సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. కాలేజీ పక్కనే ఉన్న భూపయ్య కాలనీ వాసులు కొందరు కాలేజీ స్థలంలో గుడిసెలు వేసి ఉన్నారని వాటిని తొలగించి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉందని దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణలు తొలగించి నిర్మాణం చేపట్టాలని సభ్యుల సమావేశంలో తీర్మానించినట్లు, అదేవిధంగా ఇటీవల కాలేజీలో తృతీయ సంవత్సరం బీఏ విద్యార్థి కంటేపల్లి చరణ్ రాష్ట్రస్థాయిలో విశేష గుర్తింపు సాధించిన నేపథ్యంలో ఆ విద్యార్థిని సభ్యులు అభినందించారు. ఆగ్రాలో 23 రోజుల పాటు జరిగిన పారా బేసిక్ కోర్స్‌లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిగా చరణ్ నిలవడం కాలేజీకి గర్వకారణమని సభ్యులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అతనిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. సిపిడిసి సెక్రెటరీ పెసల జయరాజు గోపాల్ మాట్లాడుతూ ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థి చరణ్‌కు భవిష్యత్తులో ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సిపిడిసి సభ్యులు రామచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, బాలరాజు, చంద్రశేఖర్, గోపీనాథ్, కాలేజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. సరస్వతీ బాయి పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బృందానికి శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని బహూకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు పెంచడంతోపాటు మెగా డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ల పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా నియమితులైన రెడ్డివారి గురవారెడ్డిని ఘనంగా సత్కరించారు. పలువురు టిడిపి బీసీ విభాగం నేతలు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగడానికి ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళలు స్వశక్తితో ఎదగడానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళ తన కాళ్ళపై తాను నిలబడి కుటుంబాన్ని పోషించే స్థాయికి రావడానికి అన్ని అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలుగు మహిళా నేత పులివర్తి సుధారెడ్డి అన్నారు. శుక్రవారం మంగళం పరిధిలోని డ్వాక్రా మహిళా సంఘాలకు సంబంధించి పెరటి కోళ్ల పెంపకం కార్యక్రమం ద్వారా 31 మందికి పెరటి కోళ్లను అందించారు. ఈ సందర్భంగా పులివర్తి సుధా రెడ్డి, టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. పిల్లల భవిష్యత్ తరాలకు మంచి చేసే నాయకులను ఎన్నుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చే తాయిలాలకు ఆశపడి బిడ్డల భవిష్యత్తును దూరం చేసుకోవద్దని హితవు పలికారు. అసిల్ బ్రీడ్ జాతికి చెందిన ఈ కోళ్లు 365 రోజుల్లో 300 రోజులు గుడ్లు పెడతాయని, ఒక్కో యూనిట్లో 11 కోళ్లు ఉంటూ ఒక యూనిట్ ధర రూ.3180గా ఉందని ఏపీఎం నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు గౌతమ్ కుమార్, ఉమామహేశ్వరరావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ భూషణం, స్థానిక టిడిపి నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిటిడికి ఇండియన్ బ్యాంక్ విరాళం

ప్రజాశక్తి - తిరుమల: టీటీడీకి ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేశ్ కుమార్ రూ. 37,97,508 విరాళం అందజేశారు. శుక్రవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కలసి విరాళం డీడీని ఇచ్చారు. తిరుమలకు వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అలిపిరి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేయనున్న సెక్యూరిటీ లగేజీ స్కానర్ కోసం ఈ విరాళం అంద చేసినట్లు తెలిపారు. ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం. సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఇందిరా, తిరుమల బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

స్విమ్స్ ట్రస్ట్‌కు విరాళాలు

ప్రజాశక్తి - తిరుమల: హైదరాబాద్‌కు చెందిన హిమశ్రియ దంతు అనే భక్తురాలు టీటీడీ స్విమ్స్ ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. అదేవిధంగా ఫ్లాష్ లైన్ ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు వారి ప్రతినిధి కుప్పాల నీలేష్ కుమార్ తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.


ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రజల భాగస్వామ్యంతో పేదరికాన్ని నిర్మూలించి అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పి4 ను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. బంగారు కుటుంబాలకు తాత్కాలిక లబ్ధి కాక, వారిలో దీర్ఘకాలిక మార్పు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎంఆర్ పల్లి అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బంగారు కుటుంబాల హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణలు ప్రారంభించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు వైద్యసేవలు అందించడం సంతోషకరమని కమిషనర్ మౌర్య కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఐ.ఎం.ఏ. అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఉపాధ్యాయులు, పాఠశాలలో చదివే విద్యార్థులు, తల్లితండ్రులు స్నేహపూర్వకంగా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సురేష్ సూచించారు. శుక్రవారం తిరుపతి పట్టణం, విద్యానగర్ కాలనీలో తారకమా నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా ప్రైమరీ, హాస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో హ్యాపీక్లబ్ నిర్వహించారు. వారితో ఆటలు, సంభాషణ, అనుభవాల పంచుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల విద్యా స్థాయి, అవగాహనల గురించి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎ.జి.యం. సురేశ్ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీప్రపన్న మాట్లాడుతూ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక బంధం బలపడేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడ తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పిల్లలు పాల్గొన్నారు..

కుప్పం బాదూరు విద్యార్థికి బంగారు పతకం



ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఢిల్లీ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజనికుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థి ఢిల్లీ, వ్యాయామ ఉపాధ్యాయులు గోపీనాథ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఢిల్లీ నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఈనెల 16, 17,18 తేదీలలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయి అండర్ -14 బాలబాలికల వాలీబాల్ పోటీలలో బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు తరుపున పాల్గొని గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. విద్యార్థి ఢిల్లీ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు గోపీనాథ్ తన ప్రతిభను గుర్తించి క్రీడల్లో రాణించేలా మెలకువలు నేర్పించి ప్రోత్సహించారని తెలిపాడు.

నిత్యాన్నదానం ప్రారంభించండి : ఎమ్మెల్యే కోనేటి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: టిటిడి అనుబంధ ఆలయాలైన నాగలాపురం, శ్రీ వేదవల్లి సమేత వేద నారాయణ స్వామి ఆలయంలో, నారాయణవనం, శ్రీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టిటిడి ఈవో అశోక్ సింఘాల్‌ను కోరారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి, టీటీడీ పరిపాలనా విభాగ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని ఈఓకు వినతి పత్రం సమర్పించారు. నాగలాపురం ఆలయ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి భక్తులకు స్వామి, అమ్మవార్ల మూల విరాట్ దర్శన భాగ్యం కల్పించాలని ఈఓను కోరారు. నారాయణవనం మండలం లోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం, అవనాక్షమ్మ ఆలయాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అవనాక్షమ్మ ఆలయ సందర్శనకు రావాలని ఈఓను ఆహ్వానించారు.

పోస్టాఫీసు పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-9 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో, 5వ రోజు పోస్టల్ శాఖకు చెందిన ప్రియాంక పాల్గొని, పోస్టాఫీసులో అందుబాటులో ఉన్న వివిధ పథకాలు, సేవల గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా విభజించి గ్రామస్తులకు డిజిటల్ మోసాలపై అవగాహన కల్పిస్తూ, యుపిఐ చెల్లింపుల వినియోగ విధానాన్ని వివరించారు. వాలంటీర్లు, యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.జ్యోత్స్న, పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు 6 నెలల జైలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నిర్లక్ష్యంగా టిప్పర్ నడిపి ఒకరి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌కు శుక్రవారం న్యాయమూర్తి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. గూడూరు రూరల్ ఎస్సై తిరుపతయ్య తెలిపిన వివరాల మేరకు 2020 ఫిబ్రవరి 12వ తేదీన సైదాపురంకు చెందిన మల్లారపు రమణయ్య కుమారుడు శీనయ్య(25) అనే యువకుడు కాంద్రకు చెందిన సమీప బంధువు నన్నూరు వెంకటరమణయ్యను బైక్ పై ఎక్కించుకొని గూడూరు వైపు వస్తున్నాడు. అదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ గూడూరు రూరల్ ప్రాంతంలోని నెలటూరు సమీపంలో, ముత్తుమారి కళ్యాణ మండపం వద్ద బైకును ఢీకొంది. దీంతో శీనయ్య అక్కడికక్కడే మృతి చెందగా వెంకటరమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా టిప్పర్ డ్రైవర్ పులి వెంకటేశ్వరరావును అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందన్నారు. అప్పటినుంచి కేసు విచారణలో భాగంగా వాదోపవాదాలు పూర్తి కాగా టిప్పర్ డ్రైవర్ నేరం నిరూపణ అయింది. దీంతో గూడూరు అడిషనల్ జ్యుడీషియల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి. సులోచన రాణి తీర్పు ఇస్తూ టిప్పర్ డ్రైవర్ కు 6 నెలలు పాటు జైలు శిక్ష 1500 రూపాయల జరిమానాలను విధించారు. కేసును ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ లక్ష్మీనారాయణ వాదించారు.

బెస్ట్ ఇన్వెస్టిగేషన్‌లో మధుబాబుకు అవార్డు ప్రదానం



డీజీపీ నుండి అవార్డు అందుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలో డబ్బులు కోసం అశ్లీల లైవ్ స్ట్రీమింగ్ చేయిస్తూ సైప్రెస్ దేశం కేంద్రంగా గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్న ఈ రాకెట్‌ను ఛేదించి పది మందిని అరెస్టు చేయడంతో సిఐడి సైబర్ క్రైమ్ విభాగంలో సిఐగా విధులు నిర్వర్తిస్తున్న మధుబాబుకు డైరెక్టర్ జనరల్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా శుక్రవారం అవార్డు ప్రదానం చేశారు. దాదాపు 8 నెలలపాటు కొనసాగిన ఇన్వెస్టిగేషన్‌లో బెంగళూరు, హైదరాబాద్, గుంతకల్లు ప్రాంతాల్లో అమాయక ప్రజలకు డబ్బులు ఆశ ఎరచూపి అశ్లీల లైవ్ స్ట్రీమింగ్ చేయిస్తూ సైప్రెస్ దేశ క్రిప్టో కరెన్సీని లైవ్ స్ట్రీమింగ్‌లో పాల్గొన్న వారికి ఇచ్చే విధంగా కొనసాగుతున్న ఈ రాకెట్‌ను విజయవంతంగా చేదించడంలో మధుబాబు సేవలను డిజిపి హరీష్ కుమార్ గుప్తా ప్రత్యేకంగా ప్రశంసించారన్నారు. ఈ రాకెట్ నడుపుతున్న వారి ఆస్తులను, బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడం జరిగిందని మధుబాబు తెలిపారు. దాదాపు రెండు కోట్ల వరకు వీటి విలువ ఉంటుందన్నారు. సిఐడి డీజీ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రూరల్ మండలం, అక్కుర్తి గ్రామంలో శనివారం ఎంజీఎం శ్రీకాళహస్తి హాస్పిటల్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మంది అక్కుర్తి గ్రామ మహిళలు, మైనర్ బాలికలు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందారు. స్త్రీల సమస్యలు, వ్యక్తి గత శుభ్రతపై వైద్యులు అవగాహన కల్పించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్, డాక్టర్ లక్ష్మి ప్రసన్న, డాక్టర్ ఉమా మహేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం, నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను ఐదు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించారు. అధ్యాపకులకు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలతో పరిశోధనాత్మక, వృత్తి నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రిసోర్స్ పర్సన్ సాయి కుమార్, ప్రిన్సిపాల్ విశ్వక్సేన రెడ్డి, భాస్కర్, శివకుమార్, ఏవో కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, ప్రతినెల మూడవ శనివారం గూడూరులో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమములో భాగంగా శనివారం ఉదయం స్థానిక పురపాలక కార్యలయం, గూడూరు ఆవరణలో ప్లాస్టిక్ వేస్ట్, సాలిడ్ వేస్ట్, ఈ-వేస్ట్ ఎలక్ట్రానిక్ వ్యర్ధాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళలకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మహిళలకు మెరుగైన వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఏ.విమల, పి.దుర్గా భవాని డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి గంధంనేని శివయ్య భవన్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 10వ నగర మహాసభ నగర అధ్యక్షురాలు సీ.రత్నమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హాస్పిటల్స్‌లో మహిళలకు మెరుగైన వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో డాక్టర్స్, నర్సులు, సరైన మందులు అందుబాటులో లేవని, గర్భిణీ స్త్రీలు హాస్పటల్‌కి వెళితే బెడ్స్ లేక వరండాలో పడుకోబెట్టి, ఒక్కొక్క బెడ్ పై ఇద్దరు ముగ్గురు మహిళలు పండుకోబెట్టి వైద్యం చేస్తున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో జయలక్ష్మి, నదియా, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, విశ్వనాథ్, మంజుల, విజయ, హరిత, లక్ష్మి, ప్రమీల, అలివేలు, వనిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష ఫలితాలతో వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలంలో, జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో శుక్రవారం భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ అధికారులుమాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడితే, రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక ఆహార భద్రత చేకూరుతుందని తెలిపారు. రేణిగుంట మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వరలకేంద్రం తిరుపతికి చెందిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది రేణిగుంట మండల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని గూడూరు ఏ.ఎం.వి.ఐ ప్రభాకర్ పేర్కొన్నారు. చిల్లకూరు మండల పరిధిలో, బూదనం టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.